సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



పాదగయ దర్శనం


పిఠాపురం: పాదగయ క్షేత్రాన్ని సమాచార హక్కు చట్టం కమిషనర్ జీవీ రమణకుమార్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఉదయలక్ష్మి మంగళవారం దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.



రెగ్యులర్‌గా మెమూ రైళ్లు

రాజమహేంద్రవరం సిటీ: విజయవాడ – రాజమహేంద్రవరం మధ్య మెమూ రైళ్లను బుధవారం నుంచి రోజూ నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటించారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు మంగళవారం 5,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,760, మధ్య డెల్టాకు 1,145, పశ్చిమ డెల్టాకు 3,065 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.80 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

పోలీస్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డి తదితరులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పోలీసు అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన పోలీస్ డైరీ 2023ను జిల్లా పోలీసు కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సీహెచ్.సుధీర్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో మరింత పారదర్శకతతో, నిబద్ధతతో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా ఉపయోగించుకోవాలన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకుని, ప్రజలతో గౌరవప్రదమైన సంభాషణ చేస్తూ, సామాజిక కార్యక్రమాలలో భాగస్వాములై మన పోలీసు సేవలను జిల్లా ప్రజలకు మరింత చేరువ చేయాలన్నారు. సిబ్బంది సంక్షేమ విషయంలో అన్ని విధాల సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. డైరీ ఆవిష్కరణలో అడిషనల్ ఎస్పీ ఎం.రజనీ, అడిషనల్ ఎస్పీ జి.వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.రఘురాం, వైస్ ప్రెసిడెంట్ జె.సాయి మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృ మరణాలు విచారకరం

అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో గతేడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ మూడు నెలల్లో ఏడు మాతృ మరణాలు సంభవించడం దురదృష్టకరమని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణిగా నమోదైన దగ్గర నుంచీ ఎంసీపీ కార్డులో సమగ్రమైన విధానంలో అన్ని పరీక్షల వివరాలు పొందుపర్చాలన్నారు. రక్త పరీక్షలు, రక్తపోటు, మధుమేహం, హిమోగ్లోబిన్ తదితర పరీక్షల ఫలితాలు కార్డులో నమోదు చేయాలన్నారు. ప్రమాద స్థితిలో ఉన్న గర్భిణులను ప్రసవ సమయానికి పది రోజులు ముందుగానే రిఫరల్ ఆసుపత్రులకు తరలించాలన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆశ కార్యకర్త నుంచి వైద్యాధికారుల వరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మాతృ మరణాలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో బుధవారం నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక పింఛన్ల పంపిణీ జరుగుతుందని డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ సిరిపురపు సుభాషిణి తెలిపారు. వివిధ రకాల పింఛన్లకుగాను జిల్లాలో 2,36,872 మందికి ప్రభుత్వం రూ.65.28 కోట్లు విడుదల చేసిందన్నారు. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు పంపిణీ ప్రారంభిస్తారన్నారు.

రేపట్నుంచి నన్నయలో జాతీయ సదస్సు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 'ప్రాచీన తెలుగు సాహిత్యం, చారిత్రక, సామాజిక, సాంస్కృతిక, దృక్పథాలు' అనే అంశంపై ఈనెల 2 నుంచి మూడు రోజల పాటు జాతీయ సదస్సు జరుగనుంది. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య అశోక్ ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు శాఖ, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం (నెల్లూరు), భారతీయ భాషా సంస్థ (మైసూరు), విద్యా మంత్రిత్వ శాఖ, కేంద్ర ఉన్నత విద్యా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు జరుగుతుందన్నారు. సంచాలకులుగా ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్, ఆచార్య సీవీ శివరామకృష్ణ, కన్వీనర్‌గా డాక్టర్ తరపట్ల సత్యనారాయణలు వ్యవహరిస్తారన్నారు.

ఉత్సాహంగా బాక్సింగ్ పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో మంగళవారం రాష్ట్రస్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ ఉత్సాహంగా ప్రారంభమైంది. అండర్ 14, 17, 19 విభాగాల్లో మూడు రోజుల పాటు పోటీలు జరుగుతాయి. వీటికి 13 జిల్లాల నుంచి సుమారు 100 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఆర్‌ఐపీఈ ఎం.మనోహర్, డీవీఈఓ జీవీఎస్ సుబ్రహ్మణ్యం, డీఈ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కాగా.. మైదానంలో ఏర్పాటు చేసిన రెండు బాక్సింగ్ రింగ్‌ల్లో క్రీడాకారులు హోరాహోరిగా తలపడ్డారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు బీవీ ఆనంద్, ఎంవీఎం సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.నాగు కుమార్, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏవీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

- రైల్వే బడ్జెట్‌పై ఎప్పటిలాగే కోటి ఆశలు
- మందకొడిగా కోటిపల్లి – నర్సాపురం రైల్వే లైన్
- నానాటికీ పెరుగుతున్న అంచనా వ్యయం
- కాకినాడ మెయిన్ లైన్ మాటేమిటో!
- హేవలాక్ బ్రిడ్జి పర్యాటక కేంద్రమయ్యేనా!
- కొవ్వూరు – భద్రాచలం రైల్వే లైన్ పట్టాలెక్కేనా!
- నిర్మలా సీతారామన్ కరుణకు నిరీక్షణ



సీతమ్మ బండి.. ఆగేనాండీ..



పెండింగ్ ప్రాజెక్టులపై సానుకూల నిర్ణయం

పెండింగ్ ప్రాజెక్టులపై కేంద్ర బడ్జెట్‌లో సానుకూలంగా కేటాయింపులు జరపాలి. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ రోడ్డును 80 అడుగులకు విస్తరించాలి. హేవలాక్ బ్రిడ్జి వ్యవహారం త్వరగా తేల్చాలి. ప్రభుత్వ జూనియర్ కాలేజీ సమీపాన రైల్వే బ్రిడ్జి వెడల్పు పెంచాలి. గోదావరి రైల్వే స్టేషన్‌లో 1, 2 ప్లాట్‌ఫామ్‌ల మధ్య రాకపోకలకు మరో పుట్‌వే బ్రిడ్జి ఏర్పాటు చేయాలి. వారణాసికి ప్రత్యేక రైలు నడపాలి. తూర్పు రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలి. రాజమహేంద్రవరం అన్నపూర్ణమ్మపేట రైల్వే గేటు స్థానంలో ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

– మార్గాని భరత్‌రామ్, ఎంపీ, రాజమహేంద్రవరం





సాక్షి ప్రతినిధి, కాకినాడ: దశాబ్దాల కలలు సాకారం కావాలి. ఉమ్మడి 'తూర్పు'న రైల్వే ప్రాజెక్టులు పట్టాలెక్కాలి. కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రతి సందర్భంలో ఆశగా ఎదురు చూడటం.. నిరాశపడటం షరా మామూలుగానే జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో బుధవారం కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈసారైనా పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపై కరుణ చూపిస్తారా అని ఈ ప్రాంత ప్రజలు గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.

పచ్చజెండా ఊపినా ఫలితం ఏదీ..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వాసుల చిరకాల కోరిక కాకినాడ – పిఠాపురం మెయిన్‌లైన్. ఈ రైల్వే లైన్ సాధనకు సుమారు నాలుగు దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు నిరీక్షిస్తున్నారు. లాభదాయకం కాదన్న ఈ ప్రాజెక్టును సాకుతో రైల్వే బోర్డు అటకెక్కించింది. ఈ రైల్వేలైన్ పట్టాలెక్కితే దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురానికి మహర్దశ పడుతుంది. ఆ ఆశలు అడియాసలైన నేపథ్యంలో కాకినాడ మెయిన్ లైన్ నిర్మించాలనే డిమాండ్ తెర మీదకు వచ్చింది. ఇందుకోసం ఎంపీ వంగా గీత, సాధన సమితి ప్రతినిధులు ఎవరి స్థాయిలో వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతిపాదిత కాకినాడ మెయిన్ లైన్ నిర్మాణానికి రూ.40 కోట్లతో 22 ఏళ్ల క్రితమే గ్రీన్ సిగ్నల్ లభించినా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. సరికదా అంచనా వ్యయం 2017 నాటికి రూ.200 కోట్లకు పెరిగింది. నాటి బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించినట్టే కేటాయించి మొత్తం ప్రాజెక్టునే పక్కన పెట్టేశారు. కాకినాడ – పిఠాపురం మధ్య కేవలం 24 కిలోమీటర్ల రైల్వే లైన్ వేస్తే దశాబ్దాల కల నెరవేరుతుంది. విజయవాడ రైల్వే డివిజన్‌లో 25 శాతం ఆదాయం వస్తున్న కాకినాడ పోర్టుతో అనుసంధానమయ్యే ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది.

త్వరితగతిన భూసేకరణ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కోటిపల్లి – శానపల్లిలంక గ్రామాల మధ్య గౌతమీ గోదావరి నదిపై రైల్వే వంతెన పిల్లర్ల నిర్మాణం పూర్తయింది. వైనతేయ గోదావరిపై బోడసకుర్రు – పాశర్లపూడి మధ్య వంతెనకు 12 పిల్లర్లు నిర్మించారు. మరో తొమ్మిది నిర్మాణ దశలో ఉన్నాయి. దిండి – చించినాడ మధ్య వశిష్ట గోదావరిపై 18 పిల్లర్లు నిర్మించారు. అయితే ఒకటో నంబరు పిల్లర్‌కు భూసేకరణ జరగలేదు. మొత్తంగా కోటిపల్లి – నర్సాపురం రైల్వే లైనుకు 911 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా ఇప్పటి వరకూ 338 ఎకరాలు సేకరించారు. మిగిలిన భూమి సేకరణకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సి ఉంది.

కోటిపల్లిలో కూత వినపడేనా..



కోటిపల్లి – శానపల్లిలంక మధ్య గౌతమీ గోదావరిపై రైల్వే వంతెనకు నిర్మించిన పిల్లర్లు

ఉమ్మడి తూర్పు గోదావరిలో కోటిపల్లి – నర్సాపురం రైల్వే లైన్ ప్రాజెక్టు కీలకం. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలను అనుసంధానం చేసే ఈ ప్రాజెక్టు ఎంతో కీలకమైనది. ప్రజా రవాణాగానే కాకుండా వాణిజ్యపరంగా కొబ్బరి ఎగుమతికి ఇది ప్రధానమైంది.

కోనసీమ ప్రాంతంలో రైలు కూత వినాలనే కల సాకారం కావాలంటే ఈ బడ్జెట్‌లో సీతారామన్ నిధులు కేటాయించాలి. కోనసీమ కేంద్రం అమలాపురంలో 2000 నవంబర్ 16న అప్పటి రైల్వే మంత్రి, ప్రస్తుత పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ ప్రాజెక్టుకు భూమి పూజ చేశారు. 55 కిలోమీటర్ల ఈ రైల్వే లైను కోసం గౌతమి, వశిష్ట, వైనతేయ గోదావరి పాయలపై మూడు వంతెనలు నిర్మాణంలో ఉన్నాయి. నిధుల విడుదల, నిర్మాణ జాప్యంతో రూ.645 కోట్ల అంచనా కాస్తా రూ.2,892 కోట్లకు చేరింది. విభజన అనంతరం రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందనే ఆలోచన కూడా లేకుండా వాటా నిధులు ఇవ్వలేదనే సాకుతో రైల్వే శాఖ ఇటీవల ఈ పనులు నిలిపివేసింది. గత జూన్ నాటికి కేంద్రం ఈ రైల్వే లైనుకు రూ.1,095.80 కోట్లు కేటాయించగా గత మార్చి నాటికి రూ.1083.03 కోట్లు వెచ్చించారు.

చిన్నిచిన్ని ఆశ..

- విజయవాడ – విశాఖపట్నం మధ్య రాజమహేంద్రవరం ప్రధానమైన రైల్వే స్టేషన్. తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల నుంచి ప్రజలు లక్షలాదిగా ఈ స్టేషన్ నుంచే రైలు ప్రయాణాలు సాగిస్తారు. ఆక్వా కల్చర్, ఉద్యాన పంటల ఎగుమతులకు ఇది కీలక ప్రాంతం. ఈ విషయాన్ని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఇదివరకే రైల్వే బోర్డు చైర్మన్‌కు నివేదించారు.
- రాజమహేంద్రవరం – కొవ్వూరు మధ్య హేవలాక్ బ్రిడ్జిని రాష్ట్ర ప్రభుత్వానికి రైల్వే శాఖ అప్పగించాలి. ప్రతిగా కొవ్వూరు వద్ద భూ బదలాయింపునకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉన్నా రైల్వే శాఖ శ్రద్ధ చూపడం లేదు.
- రాజమహేంద్రవరంలోని రైల్వే శాఖ ఖాళీ స్థలాల్లో ఫుడ్ కోర్ట్, మాల్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లు, డార్మెటరీలు, వీఐపీ లాంజ్, మల్టిప్లెక్స్‌లు నిర్మించేందుకు అవకాశం ఉంది.
- రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో ముఖ్యమైన ఏడు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని, జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు నిడదవోలు, అనపర్తి తదితర స్టేషన్లలో హాల్ట్ ఇవ్వాలన్నది ఈ ప్రాంత ప్రజల డిమాండ్.
- ఉభయ గోదావరి జిల్లాలతో పాటు విశాఖ నుంచి వారణాసి వెళ్లే భక్తులకు వారానికి రెండు రోజుల పాటు కొత్త రైలు వేయాలని కోరుతున్నారు. రాజమహేంద్రవరం నుంచి గౌహతి, కోల్‌కతా, బిహార్, బెంగళూరు తదితర ప్రాంతాలకు రైళ్ల సంఖ్యను పెంచాలి.
- కొవ్వూరు – భద్రాచలం మధ్య 131 కిలోమీటర్ల పొడవున ప్రతిపాదించిన రైల్వే లైనును కూడా పట్టాలెక్కించాల్సి ఉంది.

ఫైలేరియా నిర్మూలనకు ప్రణాళిక

వైద్యాధికారులతో కలెక్టర్ మాధవీలత సమీక్ష

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో ఫైలేరియా నిర్మూలన దిశలో సామూహిక ఔషధ పరిపాలన విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. ఫైలేరియా నిర్మూలనపై సమన్వయ వైద్యాధికారులతో మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎండీఏ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫైలేరియా కేసులు నమోదు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏ ప్రాంతాల్లో వ్యాధి ప్రబలే అవకాశాలు ఉన్నాయి అనే అంశంపై పూర్తిస్థాయి అధ్యయనం చేయాలన్నారు. ఇందుకోసం సంబంధిత అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. సామూహిక ఔషధ పరిపాలన విధానాన్ని జిల్లాలో అమలు చేయడం కోసం ఫిబ్రవరి 10న సమావేశం నిర్వహిస్తామని, ఆ రోజుకు సమగ్ర అధ్యయనం చేపట్టి సమావేశానికి హాజరు కావాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో ఫిబ్రవరి 3, 4 తేదీల్లో, సచివాలయం పరిధిలో 5వ తేదీన నిర్వహించి, ఆ సమావేశాల్లో తీసుకున్న చర్యలపై జిల్లాస్థాయిలో సమావేశానికి సన్నద్ధం కావాలన్నారు. జిల్లాలో ఇప్పటికే రాజమహేంద్రవరం అర్బన్, కోరుకొండ, ధవళేశ్వరం బ్లాక్, మండపేట, పెద్దాపురం సబ్ యూనిట్ల పరిధిలో కేసులు గుర్తించి, చికిత్స అందిస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. 2,596 మందికి కాళ్లకు, 70 మందికి చేతులకు సోకిన బాధితులు ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీటీసీఓ ఎన్.వసుంధర, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సనత్ కుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు జి.వరలక్ష్మి, లూసి కోఆర్డిలియా పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ ల్యాబ్‌లపై నిఘా

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): లింగ నిర్ధారణ చేసే ల్యాబ్‌లపై, అబార్షన్ చేస్తున్న కేసులకు సంబంధించి ఆసుపత్రుల వారీగా నివేదిక సమర్పించాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్ పై సమన్వయ శాఖల, సభ్యుల కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో జరిగే జననాల నిష్పత్తిపై సమగ్రంగా నివేదిక అందజేయాలన్నారు. ఆసుపత్రులు, ల్యాబ్‌లపై పర్యవేక్షణ లోపం ఉందన్న ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. జిల్లాలో లింగ నిర్ధారణ చేసే అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి ల్యాబ్‌పై నిర్ణీత సమయంలో ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. కొన్ని పేరున్న ఆసుపత్రులలో అబార్షన్ కేసులు ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్న దృష్ట్యా దృష్టి పెట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 481 అబార్షన్ కేసులు నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు

జై జనార్దన...

- నేటినుంచి జనార్దనస్వామి కల్యాణ మహోత్సవాలు
- మధ్యాహ్నం రథోత్సవం, రాత్రి కల్యాణోత్సవం



శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ లక్ష్మీజనార్దనస్వామి

ధవళేశ్వరం: నవజనార్దనుల్లో ప్రథముడైన ధవళగిరి జనార్దనస్వామి కల్యాణ మహోత్సవానికి ధవళేశ్వరంలోని ధవళగిరి సిద్ధమైంది.శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీజనార్దనస్వామి దివ్య కల్యాణమహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 6వ తేదీ వరకు వైభవోపేతంగా జరుగుతాయి. ఉభయ గోదావరి జిల్లాల నుంచి వేల మంది తరలిరానున్నారు. ఆరు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించేందుకు దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఉత్సవ ఏర్పాట్లపై అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం 3.15 గంటలకు స్వామివారి రథోత్సవం ప్రారంభమవుతుంది. రథంవీధి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు కన్నుల పండువుగా సాగనుంది. రాత్రి 9 గంటలకు స్వామివారి కల్యాణం మహోత్సవం నిర్వహించనున్నారు. ధవళేశ్వరం జనార్దనస్వామి రథానికి 150 ఏళ్ల పైబడి చరిత్ర ఉంది. కల్యాణోత్సవానికి ముందు స్వామివారి రథోత్సవం జరుపుతారు. పూరీ తరువాత ఇదే భారీ రథం. సుమారు 40 అడుగుల పొడవు కలిగిన దీనిని ఒకే చెట్టు కలపతో నిర్మించారు. స్వామివారి రథాన్ని లాగితే కష్టాలు తొలగుతాయని భక్తుల నమ్మకం. దానిపైన కట్టే గొడుగును భక్తులు అరటిపండ్లతో కొట్టడం ఆనవాయితీ.

దేవదేవుని కల్యాణం.. దేదీప్యభరితం

- వైభవంగా లక్ష్మీనృసింహుని పరిణయోత్సవం
- రాత్రి 12.46 గంటల సుముహూర్తాన పావన ఘట్టం
- కన్నులారా తిలకించి, పులకరించిన భక్తజనం
- జనసంద్రాన్ని తలపించిన అంతర్వేది క్షేత్రం



కల్యాణోత్సవానికి తరలివచ్చిన భక్తులు



స్వామి సన్నిధికి విద్యుద్దీప సోయగాలు

సాక్షి అమలాపురం/సఖినేటిపల్లి: చెంతనే ఉన్న సాగర ఘోషతో పోటీ పడేలా భక్తజనం గోవింద నామోచ్చారణలు.. వేద పండితుల సుస్వర మంత్ర పఠనాలు.. ప్రతి ఘట్టాన్నీ గుర్తు చేసేలా మంగళ వాయిద్య నాదాలు.. అందంగా అలంకరించిన పందిళ్లు.. పట్టపగటితో పోటీ పడేలా.. కళ్లు మిరుమిట్లు గొలిపేలా వెలుగులు వెదజల్లే విద్యుద్దీపాలు.. సుగంధభరితమైన రంగురంగుల పువ్వులతో శోభాయమానంగా తీర్చిదిద్దిన కల్యాణ వేదిక.. దానిపై పట్టు వస్త్రాలు, సర్వాభరణాలు ధరించి, బుగ్గన చుక్కతో వరుడిగా మెరిసిపోతున్న స్వామివారు.. ఆ పక్కనే వధువులుగా కొలువుదీరిన అమ్మవార్లు.. ఒక్క మాటలో చెప్పాలంటే శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో.. జగదానందకారకుడైన నారసింహస్వామి వారి వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవం జరిగిన వేళ.. అంతర్వేది దివ్యక్షేత్రం భూతల వైకుంఠాన్ని తలపించింది. దేదీప్యమానంగా వెలిగిపోయింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు.. నయనానందకరంగా సాగిన శ్రీలక్ష్మీ నృసింహస్వామి వారి కల్యాణోత్సవాన్ని కన్నులారా తిలకించి, పులకరించిపోయారు.

అంగరంగ వైభవంగా..

ఎదురు సన్నాహ వేడుకతో మంగళవారం రాత్రి 10 గంటలకు కల్యాణ తంతు ప్రారంభమయింది. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం.. శ్రీవారి తరఫున పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్.. అమ్మవారి తరఫున అర్చక స్వాములు వివాహకర్తలుగా నిలిచారు. ఆలయం నుంచి తొలుత స్వామి వారిని, తరువాత అమ్మవార్లను వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్య ఘోష నడుమ అర్చకులు, అధికారులు, మాజీ ట్రస్టీలు పల్లకీలో వేర్వేరుగా కల్యాణ మంటపం వద్దకు తోడ్కొని వచ్చారు.

రాత్రి 12.46 గంటలకు రోహిణీ నక్షత్రయుక్త తులా లగ్న పుష్కరాంశంలో స్వామి వారి కల్యాణోత్సవం జరిగింది. వైష్ణవ సంప్రదాయబద్ధంగా వైఖానస ఆగమానుసారం ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి పర్యవేక్షణలో అర్చక బృందం కల్యాణ క్రతువును నిర్వహించారు. సుముహూర్త సమయానికి జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని స్వామివారి శిరస్సుపై ప్రధానార్చకుడు కిరణ్, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల శిరస్సులపై సహాయ అర్చకులు ఉంచారు. కల్యాణం జరిగినంతసేపూ స్వామి వారి చెంతన రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్ చేతులు కట్టుకుని నిలబడి భక్తిశ్రద్ధలతో కొలిచారు. ఆనవాయితీ ప్రకారం అన్నవరం, తిరుమల తిరుపతి దేవస్థానాల నుంచి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు.

గజమాల యాత్ర

లక్ష్మీనృసింహ స్వామి ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ మెడలో ఆవిష్కరించే గజమాల యాత్ర ఊరేగింపు కూడా ఘనంగా నిర్వహించారు. కోనసీమ అగ్నికుల క్షత్రియ యువజన సేవా సంఘం ఆధ్వర్యాన ఈ ఊరేగింపు అమలాపురం రూరల్ పేరూరు వై జంక్షన్ వద్ద ఆరంభమై వివిధ ప్రాంతాల మీదుగా అంతర్వేది చేరింది. కృష్ణమ్మ విగ్రహానికి వారు గజమాలను అలకరించారు.

సర్వాభరణాలతో..

కల్యాణోత్సవ వేళ స్వామి, అమ్మవార్లను స్వర్ణాభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఎప్పటిలానే శఠారి, వైరుముడి, సూర్య పతకం, చిన్ని కిరీటం, వెండి కిరీటం, సాదా కిరీటం, కంటె, పచ్చలు, కెంపులు, వజ్రాల కిరీటం, హంస పతకం, నవరత్నాలు పొదిగిన హారం, పగడాల దండ, తొమ్మిది ఈస్టిండియా మోహాలీలు, 12 రకాల నానుతాడులు, చిన్ని లక్ష్మీ కాసుల పేర్లతో చేసిన అలంకరణతో స్వామి, అమ్మవార్లు అమితమైన సౌందర్యంతో మెరిసిపోయారు. అంతర్వేదికరకు చెందిన దివంగత డాక్టర్ పోతురాజు సూర్య వెంకట సత్యనారాయణ సమర్పించిన ఆభరణాలను సైతం అలంకరించారు.

భక్తజన సంద్రం

లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాతో పాటు పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల తీర ప్రాంత ప్రజలతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచీ వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు, ద్విచక్ర వాహనాలపై భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. అంతర్వేదిలో ఏ వీధి చూసినా జనంతో కిక్కిరిసిపోయింది. అంతర్వేది క్షేత్రం, సాగర సంగమ ప్రాంతాలు భక్తజన సంద్రాన్ని తలపించాయి. కరోనా కారణంగా వరుసగా రెండేళ్ల పాటు అంతర్వేది కల్యాణోత్సవానికి భక్తుల రాక తక్కువగా ఉన్నా.. ఈ ఏడాది మాత్రం అధిక సంఖ్యలో పోటెత్తారు. కల్యాణం మంటపం వద్ద నిర్మించిన భారీ షెడ్లలో భక్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆసీనులై.. నాలుగు గంటల పాటు సాగిన కల్యాణ క్రతువును ఆద్యంతం ఒళ్లంతా కళ్లు చేసుకుని మరీ తిలకించారు. అనంతరం సముద్ర స్నానాలకు తరలి వెళ్లారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, నర్సాపురం, పాలకొల్లుతో పాటు ఇతర డిపోల నుంచి కూడా ప్రత్యేక బస్సులు నడిపారు. స్థానికంగా వివిధ సామాజికవర్గాల సత్రాల వారు భక్తుల ఆకలి దప్పికలు తీర్చాయి.

నేడు రథోత్సవం

కల్యాణ మహోత్సవాల్లో భాగంగా అంతర్వేదిలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నూతన దంపతులుగా మూర్తీభవించిన స్వామి, అమ్మవార్లు రథంపై ఊరేగుతూ, భక్తులకు దర్శనమివ్వనున్నారు. రథయాత్ర సందర్భంగా ఆనవాయితీ ప్రకారం సోదరి గుర్రాలక్క అమ్మవారికి స్వామి వారి తరఫున అర్చకులు చీర, సారె సమర్పిస్తారు.

వాహనాల్లో గ్రామోత్సవాలు

కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం పంచముఖాంజనేయస్వామి, కంచుగరుడ వాహనాలపై స్వామివారి గ్రామోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలోని అలంకార మంటపంలో వాహనాలపై కొలువుదీరిన స్వామి, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, సుగంధభరిత పుష్పమాలికలతో అలంకరించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, మాజీ ట్రస్టీలు, ప్రముఖులు కొబ్బరి కాయలు కొట్టి గ్రామోత్సవాలకు శ్రీకారం చుట్టారు.



పంచముఖ ఆంజనేయ వాహనంపై లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో పురోహితుడి మృతి


అనంతశర్మ (పాతచిత్రం)

ఐ.పోలవరం: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన ప్రమాదంలో కేశనకుర్రు గ్రామానికి చెందిన పురోహితుడు రూపాకుల అనంతశర్మ (35) మృతి చెందారు. ఈ నెల 26న హైదరాబాద్‌లో గృహప్రవేశం చేయించేందుకు ఈ నెల 23న ఆయన అక్కడకు వెళ్లాడు. గృహప్రవేశం ముగించుకొని సొంత బైక్‌పై సోమవారం రాత్రి కేశనకుర్రు బయలుదేరారు. తాడేపల్లిగూడెం వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు గుర్తించారు. సమాచారం అందుకున్న అనంతశర్మ తండ్రి విశ్వనాథం, తల్లి, భార్యా పిల్లలు ఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లారు. శర్మ మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

చేపల చెరువులో పడి వ్యక్తి మృతి

తాళ్లరేవు: ప్రమాదవశాత్తూ చేపల చెరువులో పడి పటవల గ్రామానికి చెందిన నామా శివబాబు (30) మృతి చెందాడు. కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ కథనం ప్రకారం.. పశువులను మేపేందుకు వెళ్లిన శివబాబు సమీపంలోని చేపల చెరువుల వద్ద మొబైల్ మాట్లాడుతూ, ప్రమాదవశాత్తూ చెరువులో పడిపోయి ఉంటాడని భావిస్తున్నారు. శివబాబుకు రెండేళ్ల క్రితం వివాహమైంది. భార్య ఉంది. వీఆర్‌ఓ రమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో దాడి కేసులో ఆరు నెలల జైలు

ఉప్పలగుప్తం: మహిళపై కత్తితో దాడి చేసిన కేసులో ముద్దాయికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ అమలాపురం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.శైలజ మంగళవారం తీర్పునిచ్చారు. ఉప్పలగుప్తం ఎస్సై జి.వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. చీకట్లపాలేనికి చెందిన కె.దుర్గకు, ఆమె మేనమామ పుల్లయ్యనాయుడుకు గతంలో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. దుర్గ భర్త నుంచి విడిపోయి ఒంటరిగా బతుకుతోంది. ఈ క్రమంలో దుర్గ, అదే గ్రామంలోని బుడుగువానిపేటకు చెందిన కుంచే లక్ష్మణరావు 15 ఏళ్ల క్రితం ప్రేమించుకున్నారు. ఇద్దరూ పేరూరు చర్చిలో పెళ్లి చేసుకున్నారు. దుర్గకు వివాహేతర సంబంధం ఉందని లక్ష్మణరావు అనుమానించాడు. ఆమెపై 2020 జనవరి 16న కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనపై అప్పటి ఎస్సై కె.సురేష్ కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేసి, కోర్టుకు తరలించారు. కోర్టు విచారణలో లక్ష్మణరావుపై నేరం నిరూపణ అవడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ వెంకటలక్ష్మి వాదనలు వినిపించారు.


మొదటి మ్యాచ్ విజేత అనపర్తి జీబీఆర్ డిగ్రీ కళాశాల జట్టు


రెండో మ్యాచ్ గెలిచిన పాలచర్ల బీవీసీ టీమ్


మూడో మ్యాచ్ విజేతగా నిలిచిన జీఎస్ఎల్ జట్టు

జోరుగా.. హుషారుగా..

- ఉత్సాహంగా ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలు
- గెలుపే లక్ష్యంగా పోటీ పడుతున్న క్రీడాకారులు

రాజానగరం: 'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యాన రాజానగరం గైట్ ఇంజినీరింగ్ కళాశాల, కాకినాడ రంగరాయ వైద్య కళాశాల క్రీడా మైదానాల్లో 'సాక్షి' ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు జోరుగా హుషారుగా జరుగుతున్నాయి. విజయమే లక్ష్యంగా క్రీడాకారులు తమ శక్తులన్నింటినీ ఒడ్డుతూ పోటీ పడుతున్నారు. రెండో రోజైన మంగళవారం ఈ పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా జరిగాయి.

గైట్‌లో..

- రాజమహేంద్రవరం గైర్ ఇంజినీరింగ్, అనపర్తి జీబీఆర్ డిగ్రీ కళాశాలల జట్ల మధ్య ఉదయం మొదటి మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన జీబీఆర్ టీమ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన గైర్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 70 పరుగులు చేసింది. ఈ జట్టులో హేమంత్ 13 బంతులకు 17 పరుగులు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన జీబీఆర్ టీమ్ ప్రత్యర్థి ఇచ్చిన లక్ష్యాన్ని ఏడున్నర ఓవర్లలోనే అవలీలగా అధిగమించి, ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది.
- రెండో మ్యాచ్ పాలచర్ల బీవీసీ ఇంజినీరింగ్, రాజమహేంద్రవరం ఏకేసీ డిగ్రీ కళాశాలల జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన బీవీసీ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఏకేసీ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. ఈ జట్టులో నితీష్ 22 బంతులకు 25 పరుగులు చేయగా, చరణ్ 13 పరుగులిచ్చి, 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బీవీసీ జట్టు 9 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకుని 6 వికెట్ల తేడాతో విజేతగా నిలిచింది. నవీన్, చరణ్ చేరో 13 పరుగులు చేసి, జట్టు విజయానికి తోడ్పడ్డారు.
- మధ్యాహ్నం జరిగిన మూడో మ్యాచ్‌లో జీఎస్ఎల్ ఫిజియోథెరపీ, లెనోరా దంత వైద్య కళాశాలల జట్లు పోటీ పడ్డాయి. టాస్ గెలిచిన జీఎస్ఎల్ టీమ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన లెనోరా దంత వైద్య కళాశాల జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 93 పరుగులు సాధించింది. ఈ టీమ్‌లో అన్వేష్ 26 బంతులకు 26, శశాంక్ 13 బంతులకు 21 పరుగులు చేశారు. తరువాత బ్యాటింగ్ చేసిన జీఎస్ఎల్ జట్టు 4 వికెట్లు కోల్పోయి 9.5 ఓవర్లలోనే ప్రత్యర్థి ఇచ్చిన లక్ష్యాన్ని అధిగమించి, 6 వికెట్ల తేడాతో విజయాన్ని కైవసం చేసుకుంది.
- అంపైర్లుగా కె.అంజనీకుమార్, కె.దినేష్‌కుమార్, స్కోరర్‌గా జి.రవితేజ వ్యవహరించారు.


మొదటి మ్యాచ్ విజేత కైట్-1 జట్టు


రెండో మ్యాచ్ గెలిచిన కాకినాడ ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాల టీమ్


మూడో మ్యాచ్ విజేత సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల జట్టు

కాకినాడలో..

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రంగరాయ వైద్య కళాశాలలో జరిగిన మొదటి మ్యాచ్‌లో ప్రసిద్ధ కళాశాల, కైట్-1 జట్లు పోటీ పడ్డాయి. టాస్ గెలిచిన ప్రసిద్ధ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన కైట్-1 జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. ఈ జట్టులో విష్ణు 36, నాగేంద్ర 31 చొప్పున పరుగులు చేశారు. ప్రసిద్ధ జట్టు బౌలర్ సతీష్ 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ప్రసిద్ధ జట్టు 6 వికెట్ల నష్టానికి 64 పరుగులు మాత్రమే చేసింది. 77 పరుగుల తేడాతో కైట్-1 జట్టు విజయం సాధించింది.

- రెండో మ్యాచ్‌లో ఆదిత్య ఇంజినీరింగ్, ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాలల జట్లు తల పడ్డాయి. టాస్ గెలిచిన ఎంఎస్ఎన్ జట్టు ఫీల్డింగ్ తీసుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఆదిత్య జట్టు 9 వికెట్ల నష్టానికి 94 పరుగులు చేసింది. ఈ జట్టులోని సత్య 23, శ్రీను 15 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఎంఎస్ఎన్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 95 పరుగులు చేసి విజయం సాధించింది. దుర్గాప్రసాద్ 61, భరత్ 17 పరుగులు చేశారు.
- మూడో మ్యాచ్ సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్, కైట్-2 జట్ల మధ్య జరిగింది. ఆదిత్య జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. కైట్ జట్టు 4 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆదిత్య జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 85 పరుగులు సాధించింది. 7 వికెట్ల తేడాతో గెలుపొందింది.
- మ్యాచ్‌లను కోచ్ చార్లి, 'సాక్షి' సీనియర్ యాడ్ మేనేజర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. ఆదిత్య ఇంజినీరింగ్, కైట్-2 జట్ల క్రీడాకారులను రిఫ్రెష్‌మెంట్స్ స్పాన్సరర్, హరీష్ స్పోర్ట్స్ అధినేత తలాటం హరీష్ పరిచయం చేసుకుని, టాస్ వేసి పోటీలను ప్రారంభించారు.

ఆకాశంలో అద్భుతం

- రేపటి నుంచి కనువిందు చేయనున్న తోకచుక్క
- 50 వేల ఏళ్ల తరువాత మళ్లీ ఇన్నాళ్లకు..


కనువిందు చేయనున్న తోకచుక్క


మేకా సుసత్యరేఖ

రాజమహేంద్రవరం రూరల్: మంచుయుగంలో అంటే సుమారు 50 వేల సంవత్సరాల క్రితం కనిపించిన తోకచుక్క తిరిగి ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకూ ఉత్తర దిక్కున కనువిందు చేయనుంది. గ్రీన్ కామెట్‌గా పిలిచే ఈ తోకచుక్క సప్తర్షి మండలం మధ్య కనిపిస్తుందని బాలల సైన్స్ కాంగ్రెస్ అకడమిక్ కో ఆర్డినేటర్, భారత ప్రభుత్వ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మేకా సుసత్యరేఖ మంగళవారం తెలిపారు. వాయువులతో నిండిన అంతరిక్ష మంచుగోళాలే తోకచుక్కలని, ఒక నగరం అంత వ్యాసంతో ఉంటాయని, అవి సూర్యుడికి దగ్గరగా వచ్చినప్పుడు వేడెక్కి ధూళిని, వాయువులను అమితమైన వెలుగుతో బయటకు వెదజల్లుతాయని వివరించారు. భూమిపై జీవం ఎలా ఏర్పడిందో వీటి ద్వారా తెలుసుకోవచ్చన్నారు. భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక శాఖ సౌజన్యంతో విశ్వంలో ఉన్న ఆస్టరాయిడ్‌లు కనుగొనే కార్యక్రమంలో పాల్గొంటున్నానని సుసత్యరేఖ తెలిపారు.

త్రీమెన్ కమిటీలు.. మరో ఆరు నెలలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సహకార సంఘాలకు త్రీమెన్ కమిటీల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 298 సహకార సంఘాలున్నాయి. ఇప్పటి వరకూ కొనసాగుతున్న త్రీమెన్ కమిటీ సభ్యులు యథాతథంగా మరో ఆరు నెలలు కొనసాగుతారని సహకార శాఖ కమిషనర్ అహ్మద్ బాబు జీఓలో పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులు, దెబ్బ తిన్న ఆటో

పెరవలి: జాతీయ రహదారిపై తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లి వద్ద ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మహిళలు గాయపడ్డారు. ఎస్సై ఎం.సూర్య భగవాన్ కథనం ప్రకారం.. తణుకు నుంచి మంగళవారం ముగ్గురు ప్రయాణికులతో రావులపాలేనికి ఆటో వెళ్తోంది. ఖండవల్లి సమీపాన రోడ్డుపై గొర్రెల మంద వెళ్తోంది. వాటిని చూసిన డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఖండవల్లి గ్రామానికి చెందిన కడలి పద్మ చేయి విరిగింది. మదిరెడ్డి దుర్గా భవాని, నాగాబత్తుల నాగమణి స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను తణుకు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆవు పొడిచి వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: ఆవు పొడవడంతో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. కాకినాడ పళ్లంరాజు నగర్‌కు చెందిన సత్యవతి ఆవు మంగళవారం ఈనింది. దానిని శుభ్రం చేసేందుకు స్థానిక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్ కురసా రాము (57)ను తీసుకుని సత్యవతి ఆవు వద్దకు వెళ్లింది. శుభ్రం చేసిన అనంతరం దూడను అక్కడి నుంచి తీస్తున్న రామును ఆ ఆవు ఒక్కసారిగా కొమ్ములతో పక్కటెముకల్లో పొడిచింది. కింద పడిపోయిన రామును కొమ్ములతో పొడుస్తూ, కాళ్లతో తొక్కేసింది. తీవ్రంగా గాయపడిన రామును సత్యవతి కాకినాడ జీజీహెచ్‌కు తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ అతడు మంగళవారం రాత్రి మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నూతన రథానికి మహా సంప్రోక్షణ

- మంత్రి వేణు దంపతుల ఆధ్వర్యాన కార్యక్రమం
- 45 రోజుల్లోనే సిద్ధం


రథ శిఖరానికి పంచశయ్యాధివాసాలు నిర్వహిస్తున్న మంత్రి వేణు దంపతులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారికి కొత్తగా నిర్మించిన రథానికి ఆలయ ప్రాంగణంలో మంగళవారం శాస్త్రోక్తంగా మహా సంప్రోక్షణ నిర్వహించారు. అర్చకులు, వైదిక బృందం బ్రహ్మత్వంలో రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వరలక్ష్మి దంపతులు, ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు, వరలక్ష్మి దంపతులు, రథ నిర్మాణ స్థపతి సింహాద్రి గణపతి ఆచార్యులు, సింహాద్రి రేఖాచారి దంపతుల చేతుల మీదుగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పరిషత్ ప్రాయశ్చిత్తం, వాస్తు బ్రహ్మ రుద్ర మంటపారాధనలు, హోమాలు, రథ శిఖరానికి పంచ శయ్యాధివాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ, సుమారు 8 దశాబ్దాలుగా సేవలందిస్తున్న పాత రథం జీర్ణదశకు చేరడంతో స్వామివారి కల్యాణానికి నూతన రథం సిద్ధం చేయాలని సంకల్పించామన్నారు. అనుకున్నట్టుగానే రికార్డు సమయంలో కేవలం 45 రోజుల్లో కొత్త రథం సిద్ధం కావడం గొప్ప విషయమన్నారు. వంద సంవత్సరాలకు పైగా సేవలందించేలా నాణ్యమైన కలప, ఆధునిక సాంకేతికతతో ఈ రథాన్ని రూపొందించామని చెప్పారు. అపార అనుభవం కలిగిన స్థపతి సింహాద్రి గణపతి ఆచార్యులు 90వదిగా ఈ రథాన్ని సిద్ధం చేశారన్నారు. ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి (తారకేశ్వరరావు) మాట్లాడుతూ, నూతన రథానికి బుధవారం ఉదయం 5.25 గంటలకు మహా పూర్ణాహుతి, కుంభం కొట్టే కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

- శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు
- ఘనంగా ఏఎంసీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం


కృష్ణారెడ్డి పౌర సత్కార సభలో ప్రసంగిస్తున్న శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు. చిత్రంలో ఎంపీ బోస్, ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పద్మావతి దంపతులకు మంగళవారం రాత్రి నిర్వహించిన పౌర సత్కార సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోషేన్‌రాజు మాట్లాడుతూ, సీఎం జగన్ పాలన రైతు సంక్షేమానికి చిరునామాగా, రైతుభరోసా కేంద్రాలు రైతుల అభివృద్ధికి, సంక్షేమానికి దిక్సూచిగా నిలుస్తున్నాయని అన్నారు. అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీకి కృష్ణారెడ్డి చేస్తున్న సేవలను ప్రశంసించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమాన్ని, అభివృద్ధిని కాంక్షిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ కమిటీలను బలోపేతం చేయడమే కాకుండా, మార్కెట్ కమిటీ పాలకవర్గ పదవుల్లో కూడా సామాజిక న్యాయం పాటించిందని చెప్పారు. రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ, ప్రభుత్వ విధానాలతో రైతులకు మేలు జరుగుతోందన్నారు. రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నది ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని అన్నారు. సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ, రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ, పార్టీ అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. ఈ సభలో జెడ్పీటీసీ సభ్యులు సత్తి గీతా వరలక్ష్మి, పేపకాయల వెంకటలక్ష్మి, రొంగల పద్మావతి, పేపకాయల రాంబాబు, ఎంపీపీలు అనుసూరి సూర్యనారాయణ (బుజ్జి), కొవ్వూరి శేషకుమారి, కేతా తులసి, రిమ్మలపూడి శ్రీదేవి, మండపేట, రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్లు పతివాడ నూకదుర్గారాణి, గాదంశెట్టి శ్రీదేవి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.1.75 కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ప్రారంభించారు.

రేషన్ కార్డులకు వివాహ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- స్ప్లిట్టింగ్, కొత్త కార్డులకు ఈ సర్టిఫికెట్ ఉండాల్సిందే
- ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు
- జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మీ పట్నాయక్ వెల్లడి



కాకినాడ సిటీ: ఇకపై రేషన్ కార్డుల స్ప్లిట్టింగ్ (విభజన), కొత్త రేషన్ కార్డులకు హిందూ వివాహాల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా సర్టిఫికెట్ తీసుకున్న తరువాతే కొత్త రేషన్ కార్డు లేదా స్ప్లిట్టింగ్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే చాలా మందికి వివాహం ఆన్‌లైన్ నమోదు ఏవిధంగా చేసుకోవాలో తెలియడం లేదు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ పి.రామలక్ష్మీ పట్నాయక్ తెలిపారు. దీనిపై ఎవరికైనా సందేహాలుంటే నేరుగా సమీప సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ఇలా చేయాలి

- వధువు వయసు 18 ఏళ్లు, వరుడికి 21 ఏళ్లు నిండి ఉండాలి. దీనికి ఆధారంగా 10వ తరగతి మార్కుల జాబితా, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, జనన ధ్రువీకరణ పత్రం అప్‌లోడ్ చేయాలి.
- ఇద్దరికీ వివాహ శుభలేఖలు ఉండాలి.
- వివాహ సమయంలో తాళి కట్టిన ఫొటో తప్పనిసరి.
- వధూవరుల్లో ఒకరి చిరునామా స్పష్టంగా తెలియజేయాలి.
- ముగ్గురు సాక్షులతో కలిసి, వారి ఆధార్ కార్డులతో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాలి.
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు సమీప గ్రామ/వార్డు సచివాలయం లేదా మీ-సేవ కేంద్రాన్ని సంప్రదించాలి. నేరుగా యూజర్ ఐడీ క్రియేట్ చేసుకుని దరఖాస్తు చేసుకోవాలి.
- హిందూ వివాహ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో లాగిన్ అవ్వాలి. వివరాలు ఇచ్చాక, అనుకూలమైన సమయంలో స్లాట్ బుక్ చేసుకోవచ్చు.
- ప్రభుత్వం నిర్ణయించిన రూ.200 కాకుండా అదనంగా ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు.

విద్యుత్ షాక్‌తో ప్లంబర్ మృతి

రాయవరం: విద్యుత్ షాక్‌తో ప్లంబర్ మృతి చెందిన ఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు రాయవరం ఏఎస్సై పి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రాజేశ్వరరావు (56) 15 ఏళ్లుగా వెంటూరు గ్రామ పంచాయతీలో వాటర్ వాచ్‌మన్ కమ్ ప్లంబర్‌గా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నాడు. ఉదయం 10 గంటల సమయంలో కౌలు రైతు పిల్ల సత్యనారాయణ పొలంలో బోరు రిపేరుకు వెళ్తున్నానని ఇంటి వద్ద చెప్పాడు. అతడు విద్యుత్ షాక్‌తో చనిపోయినట్టు భార్య మణెమ్మకు ఉదయం 11 గంటల సమయంలో సమాచారం వచ్చింది. అక్కడికి వెళ్లి చూసేసరికి రాజేశ్వరరావు బోరు పక్కన పడిపోయి ఉన్నాడని మణెమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.